## క్లుప్తంగా

### కేంద్రమంత్రిని కలిసిన చంద్రప్ప



కేంద్రమంత్రి ఎస్‌కే సింగ్ బగేల్‌ను సన్మానిస్తున్న చంద్రప్ప

శ్రీకాళహస్తి: కేంద్రమంత్రిగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన ఎస్‌కే సింగ్ బగేల్‌ను సోమవారం తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప న్యూఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేర్పించండి



నెలవాయి గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాల్లో పదో తరగతి పాసైన విద్యార్థినులను ఇంటర్మీయట్‌లో చేర్పించాలని అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. సోమవారం వారు నెలవాయి, వేణుగోపాలపురం, వెస్టు వరత్తూరు, కల్లివెట్టు, తలారివెట్టు, గ్రామాల్లో పర్యటించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, గ్రూపులను ప్రవేశపెట్టినట్లు, పదో తరగతి పాసైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో గ్రూపునకు 40 సీట్లు ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ సురేంద్ర, రఘువీర్, మార్టిన్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.


### రామోజీకి నివాళి



రామోజీరావుకు నివాళులర్పిస్తున్న అశోక్‌రాజు తదితరులు


నారాయణవనం: ఉషోదయ, ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు సిద్ధార్థ ఇంజినీరింగ్ సంస్థల చైర్మన్ అశోకరాజు, సిబ్బంది నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం కళాశాల ఆడిటోరియంలో జరిగిన సంస్మరణ సభలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు శ్రద్ధాంజలి ఘటించారు. కళాశాలల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన రాజు, రమేష్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, ఇంజినీరింగ్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పోలేరమ్మకు సుమంగళి పూజ



నరసరాజు అగ్రహారం నడివీధిలో ప్రతిష్ఠించిన పోలేరమ్మ శిల

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో మూడు రోజుల గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నడి వీధి పోలేరమ్మను ప్రతిష్ఠించారు. సాయంత్రం గంగమ్మ గుడిలో సుమంగళి పూజ, లక్ష్మీ పూజ, గోపూజ, నవగ్రహ హోమం, పూర్ణాహుతి పూజలు చేపట్టారు. గంగమ్మ ఉత్సవాలు సందర్భంగా వీధుల మలుపులలో అమ్మవారి రూపాల్లో విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. వీధి వీధిన వేపాకు తోరణాలు కట్టారు.



లక్ష్మీపూజ నిర్వహిస్తున్న పూజారులు

# ప్రభుత్వ బడి.. ప్రవేశాల సందడి

- సర్కారు బడుల్లో మెరుగైన వసతులు
- కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు
- ప్రభుత్వ బడుల్లో చేరేందుకు విద్యార్థుల ఆసక్తి
- ప్రవేశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి
- సెలవుల్లో అడ్మిషన్లపై ఫోకస్





వరదయ్యపాలెంలో ఇంటింటా కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందం, వరదయ్యపాలెం హైస్కూల్‌లో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు

వరదయ్యపాళెం: గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా సర్కారు బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసి మెరుగైన వసతులు కల్పించడం, బోధనలో ప్రత్యేక మార్పులు తీసుకురావడంలో విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకు పోటీగా ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో వచ్చిన ఫలితాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ విద్యార్థుల అడ్మిషన్లపై ఫోకస్ పెట్టారు. ఉన్నత పాఠశాలల పరిధిలో ఉన్న సమీప గ్రామాలు, ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ బడిలోనే తమ పిల్లలను చేర్చాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ఆ దిశగా సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో ఉన్న 307 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 38 ప్రాథమికోన్నత పాఠశాలలు, 43 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ అడ్మిషన్ల కోసం ప్రణాళికలు మొదలుపెట్టారు. ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు, మౌళిక వసతులు, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే పుస్తకాలు, ఇతర సామగ్రిని వివరిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు సాధించిన ఫలితాల గురించి కరపత్రాలను ముద్రించి తల్లిదండ్రులకు అందిస్తున్నారు. పదో తరగతి ఫలితాలకు సంబంధించి మెరిట్ విద్యార్థుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు ఆయా పాఠశాలల వద్ద ఏర్పాటు చేసి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా మండల విద్యాధికారులను, ప్రధానోపాధ్యాయులకు ఉన్నతాధికారులు మార్గదర్శకత్వం చేస్తున్నారు.

**అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోంది. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. ప్రభుత్వ బడులు ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులు సర్కారు బడుల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.



– సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం మండలం











మత్తేరిమిట్ట ప్రాథమికోన్నత పాఠశాల, వనెల్లటూరు ప్రాథమికోన్నత పాఠశాల, వరదయ్యపాళెం హైస్కూల్‌లో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వారి పేరిట ముద్రించిన కరపత్రాలు

### మాజీ ఎంపీపీ సేవలు మరువలేనివి



వరదయ్యపాళెంలో అన్నదానం

వరదయ్యపాళెం: ఎంపీపీగా మండలంలో దివంగత నాయకురాలు పన్నెం జీవమ్మ సేవలు మరువలేనివని పలువురు స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవమ్మ 3వ వర్ధంతి సందర్భంగా వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో ఆమె చిత్రపటానికి స్థానికులు టీడీపీ శ్రేణులు నివాళులర్పించాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎంపీపీగా మండలంలో ఆమె చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. అనంతరం స్థానికులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పన్నెం నిర్మల్‌కుమార్, నాయకులు చలపతినాయుడు, వెంకటేష్, కరుణాకర్ నాయుడు, పవన్ కుమార్, జయచంద్రనాయుడు, పృథ్వీ రవి తదితరులు పాల్గొన్నారు.

### గంగమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని బజారు వీధిలో ఉన్న గంగమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాలను మూడు రోజులు ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేపట్టారు. ఈ క్రమంలోనే తొలి రోజు సోమవారం పూలంగి సేవ చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడు రోజులు వివిధ పూజలు చేస్తామన్నారు. చివరి రోజున గ్రామోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన మన బాధ్యత



చిందేపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏర్పేడు: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని ప్రగతి సంస్థ మండల కన్వీనర్లు శిరీషా, సుభాష్ చంద్రబోస్ అన్నారు. సోమవారం మండలంలోని చిందేపల్లి, కుమ్మరిమిట్ట, పోతుమానిగుంట, గోవిందవరం, చెల్లూరు ఎస్టీ కాలనీలలో ప్రపంచ బాలల హక్కుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ, సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. చదువుతోనే విజ్ఞానం కలుగుతుందని తెలిపారు. ఎక్కువగా ఎస్టీ కాలనీల్లో పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రతినిధులు వెంకటేష్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నీటి నిల్వ ఉన్న రోళ్లను తొలగిస్తున్న వైద్య సిబ్బంది

సత్యవేడు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.గుణశేఖర్ కోరారు. సోమవారం ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పీహెచ్‌సీ డాక్టర్ పర్యవేక్షణలో బాలికల గురుకుల పాఠశాలలో దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేశారు. దాసుకుప్పం పంచాయతీలో దోమల వలన కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామ పరిధిలో నీటి నిల్వలు ఉన్న తొట్టెలు, రుబ్బురోళ్లు, పగిలిన కుండలు, కొబ్బరి చిప్పలను తొలగించారు. ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఝాన్సీ, షన్ముగం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు నీడ ఏర్పాటు చేయాలి



జీఎన్‌కండ్రిగ, వీఎస్‌పురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ భానుప్రియ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద వేసవి కాలం కావడంతో కూలీలకు వడదెబ్బ తగలకుండా నీరు, నీడ సౌకర్యాలతోపాటు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఏపీడీ భానుప్రియ సిబ్బందిని ఆదేశించారు. ఆమె సోమవారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ.272 కూలీ వస్తుందని, రోజుకు 5 వేల మంది పని చేయాలని, కూలీల టార్గెట్ ప్రకారం తగ్గకుండా చూడాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్ల తోటల పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## తాగునీటి మోటారుకు మరమ్మతులు



మోటారుకు మరమ్మతులు చేస్తున్న ఎలక్ట్రీషియన్

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు మిట్టఇండ్లు గ్రామంలో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి మోటారుకు మరమ్మతులు చేశాయి. రెండు రోజుల కిందట కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో మోటారు మరమ్మతులకు గురైంది. గ్రామస్తులు సమస్యను సర్పంచ్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ మోటారుకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామస్తులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'రాజకీయ కక్షతోనే నా భూమి ఆక్రమిస్తున్నారు'



సాగుచేసిన వరిపంటను దున్ని చదును చేసిన దృశ్యం

తొట్టంబేడు : రాజకీయ కక్షలతో తన భూమిని ఓ వ్యక్తి దౌర్జన్యంగా దున్నేస్తున్నాడని మండలంలోని బోనుపల్లికి ఎస్సీకాలనీకి చెందిన వెంకటాద్రి అనే వ్యక్తి ఆరోపించాడు. వెంకటాద్రి కథనం మేరకు.. తనకు ఉన్న 4 ఎకరాల డీకేటీ భూమిలో 2.5 ఎకరాలను గతంలో అదే గ్రామానికి చెందిన మునిరత్నం అనే వ్యక్తికి విక్రయించాడు. ఆ తర్వాత ఆ భూమిని మునిరత్నం నుంచి బత్తెయ్య అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. తాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిగా ఉన్నాననే కక్షతో బత్తెయ్య ఈనెల 1న తాను 1.5 ఎకరాల్లో సాగుచేసిన వరిపంటను దున్నేయడంతోపాటు ఆ పొలానికి సాగునీటి కోసం వేసిన పైపులైన్‌ను తవ్వేశాడని వాపోయాడు. కాగా వెంకటాద్రి 4 ఎకరాల పొలాన్ని మునిరత్నంకు విక్రయించగా అతని నుంచి తాను 4 ఎకరాలకు డబ్బు చెల్లించి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నాడు. ఇదే వివాదంపై ఇరువర్గాలు తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. అయితే శాంతిభద్రతల సమస్య తలెత్తితే తాము చర్యలు తీసుకుంటామని, భూసమస్యను రెవెన్యూ అధికారుల ద్వారా పరిష్కరించుకోవాల్సిందిగా ఇరు వర్గాలకు సూచించినట్లు ఎస్ఐ తెలిపారు.

## వైఎస్‌ఆర్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం



దాసుకుప్పంలో ధ్వంసమైన జెండా దిమ్మె

సత్యవేడు: మండల పరిధిలోని దాసుకుప్పం పంచాయతీలో వైఎస్‌ఆర్ సీపీ జెండా దిమ్మెను ఆదివారం అర్ధరాత్రి టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. సురుటుపల్లి ఆలయ మాజీ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సర్పంచ్ ఏ.రవిరెడ్డి ఈ ఘటనను ఖండించారు. గతంలో ఎన్నడూ పంచాయతీ పరిధిలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని వారు తెలిపారు.

## అందరికీ అండగా ఉంటా

నాగలాపురం: ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని టీఆర్‌ఆర్ కల్యాణ మండపంలో కబడ్డీ ప్లేయర్ సుమన్ వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, అపరంజిరాజు, మహేష్ రెడ్డి, చిన్నదొరై, శ్యామ్, జె.బి.మునిరత్నం, జగదీష్ రెడ్డి, మోహన్ మొదలియార్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన వధూవరులతో నూకతోటి రాజేష్

## కో-ఆప్షన్ సభ్యుడు రాజీనామా

నారాయణవనం: మండల ప్రజా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు, వైఎస్ఆర్ సీపీ నాయకుడు మణిరెడ్డి తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల కారణంగా తన పదవికి న్యాయం చేయలేక పోతున్నానని అన్నారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం ఎంపీడీఓ కృష్ణమూర్తికి రాజీనామా లేఖను అందించినట్లు మణిరెడ్డి పేర్కొన్నారు.

## 14న శ్రీగోవిందరాజ స్వామి పుష్పయాగం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈ నెల 14వ తేదీన శాస్త్రోక్తంగా పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 14న ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

# తపాలా బీమా.. కుటుంబానికి ధీమా







గ్రామీణ ఖాతాదారుల సంక్షేమం కోసం తపాలా శాఖ సరికొత్త బీమా పాలసీని తీసుకొచ్చింది. ఏడాదికి రూ.399 ప్రీమియం చెల్లిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తోంది. ప్రీమియం చెల్లించిన రాత్రి 12 గంటల నుంచి ఏడాదిలోపు ప్రమాదంలో మరణించినా.. శాశ్వత, పాక్షిక అంగ వైకల్యం కలిగినా, పక్షవాతం సంభవించినా బీమా అందజేస్తుంది. అలాగే అర్హులైన వారికి ఆసుపత్రిలో వైద్య ఖర్చులకు సైతం ఆసరాగా నిలుస్తోంది. అలాగే ఏడాదికి రూ.699 చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. గత రెండేళ్లుగా రూ.399కే రూ.10 లక్షలు బీమా వర్తించేలా ఉండగా.. ప్రస్తుతం అందులో కొన్ని మార్పులు చేశారు. ఇందుకు 18 నుంచి 65 ఏళ్లలోపు ఉన్న ఖాతాదారులు మాత్రమే అర్హులు. – తిరుపతి (అలిపిరి)

- రూ.399తో రూ.5 లక్షల వరకు ప్రయోజనం
- రూ.699 చెల్లిస్తే రూ.10 లక్షలు
- ఖాతాదారులకు మాత్రమే అవకాశం
- పాలసీ పొందిన రోజు రాత్రి 12 నుంచే వర్తింపు
- 18–65 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు
- గ్రామీణులకు అందుబాటులో సేవలు

తపాలా శాఖ టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ, బజాజ్ అలియాంజ్, నివా బూపా వారి సౌజన్యంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని రూ.399, రూ.699 ప్రీమియంలతోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పాలసీలో ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు రూ.399 పాలసీ అయితే రూ.5 లక్షల బీమా కవరేజ్ వర్తిస్తుంది. రూ.699 పాలసీ అయితే రూ.10 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. యాక్సిడెంటల్ బీమా పాలసీ 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ పాలసీని గత రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టింది. ఇప్పటికే తిరుపతిలో జిల్లాలో మాత్రమే సుమారు 5 వేల మంది వరకు పాలసీని తీసుకున్నారు.

**బీమా పొందడం ఇలా..**

ఈ పాలసీ పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేని వారు రూ.200తో నూతనంగా ఖాతా తెరవాలి. బీమా పాలసీలను రూ.399, రూ.699 నగదు చెల్లించి పొందవచ్చు. ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్న వారికి బీమా వర్తించదు. బీమా చేసుకున్న తర్వాత ప్రమాదం సంభవించినా.. పక్షవాతం వచ్చినా బీమా వర్తిస్తుంది. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే బీమా రక్షణ ప్రారంభమవుతుంది. పాలసీదారులకు బాండును వెంటనే అందిస్తారు.

**ఇవీ ప్రయోజనాలు**

- ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.399 పాలసీదారులకు రూ.5 లక్షలు బీమా వర్తిస్తుంది.
- రూ.699 పాలసీదారులకు రూ.10 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది.
- శాశ్వత వైకల్యం కలిగితే వారికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వర్తిస్తుంది.
- పక్షవాతం సంభవిస్తే రూ.10 లక్షలు
- విద్యా ప్రయోజనం పదిశాతం (గరిష్టంగా అర్హత ఉన్న ఇద్దరి పిల్లలకు) రూ.50 వేలు వర్తిస్తుంది.
- ఆసుపత్రిలో పదిరోజుల వరకు ఉంటే రోజుకు రూ.1000 చొప్పున అందిస్తారు.
- కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.10 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు.
- యాక్సిడెంట్ మెడికల్ ఖర్చులు ఇన్‌పేషెంట్లకు రూ.60 వేల వరకు అందిస్తుంది.
- కోమా సంరక్షణ కింద రూ.50 వేలు అందిస్తుంది.
- ప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రిలో చేరితే రూ.50 వేలు చెల్లిస్తుంది.
- అలాగే డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా పొందే అవకాశం.

**కుటుంబానికి భరోసా**



తపాలా పాలసీలు అందరికీ ఉపయోగకరంగా ఉన్నాయి. ఏడాదికి రూ.399, రూ.699 చెల్లిస్తే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రమాద బీమాతో పాటు ఇతర ఉపయోగాలు అందుబాటులో ఉన్నాయి. పిల్లల విద్యాభివృద్ధికి.. ఆసుపత్రి ఖర్చులకు సైతం సౌకర్యవంతంగా ఉంటున్నాయి. ఇప్పటికే జిల్లాలో సుమారు 5 వేల మంది వకు ఈ పాలసీలను చేయించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు సైతం పాలసీలు పొందేలా తపాలా రూపొందించింది. గ్రామాల్లో పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి కుటుంబానికి ఆసరా నిలిచే ఈ పాలసీలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– జేఎం వసంత, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, తిరుపతి జిల్లా